# మలక్‌పేటలో ఆరో రోజు 12 నామినేషన్లు

మలక్‌పేట, నవంబర్ 9 : నల్గొండచౌరస్తాలోని సర్కిల్-6 డీసీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మలక్‌పేట నియోజకవర్గ నామినేషన్ కేంద్రం-58 ఏసీలో ఆరో రోజు గురువారం 12 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి మూసారాంబాగ్ సలీంనగర్‌కు చెందిన తీగల అజిత్‌రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ ఆజం అలీ, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డితో కలిసి వెళ్లి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి సైదాబాద్ రెడ్డికాలనీకి చెందిన సంరెడ్డి సురేందర్‌రెడ్డి భారీ ర్యాలీతో వెళ్లి మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, మూసారాంబాగ్, సైదాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణలతో కలిస నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వనస్థలిపురం అభ్యుదయనగర్‌కు చెందిన షేక్ అక్బర్ రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఘన సురక్ష పార్టీ అభ్యర్థిగా పాత మలక్‌పేట డివిజన్ మున్సిఫల్ కాలనీకి చెందిన గడ్డం అనితా, ఆజాద్ సామాజ్ పార్టీ అభ్యర్థిగా మూసారాంబాగ్ శాలివాహననగర్‌కు చెందిన పి.రవికుమార్, జై మహాభారత్ పార్టీ అభ్యర్థిగా మూసారాంబాగ్ శ్రీపురం కాలనీకి చెందిన నయీం సుల్తానా, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా నల్గొండ జిల్లాదేవకొండ వీరన్నగూడానికి చెందిన కొండ్రపల్లి మంజుల, ఏఐఎంఐఎం డమ్మీ అభ్యర్థిగా అక్బర్‌బాగ్‌కు చెందిన సయ్యద్ మినాజుద్దీన్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సయ్యద్ అన్వర్, గువ్వల సతీష్‌కుమార్, గంటి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్, సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన కజ్జియం భార్గవి రెండో సెట్ నామినేషన్లు దాఖలు చేశారని ఆర్‌ఓ వెంకట ఉపేందర్ రెడ్డి తెలిపారు.



బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మూసారాంబాగ్ సలీంనగర్‌కు చెందిన తీగల అజిత్‌రెడ్డి

### అజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్

సైదాబాద్ : బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా తీగల అజిత్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, మూసారాంబాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితా రెడ్డి తదితరులు మూసారాంబాగ్‌లోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. భారీ మెజారిటీతో గెలుపొందాలని ఆకాంక్షించారు.

### ఔటర్‌పై రోడ్డుపై ప్రమాదం.. వ్యక్తి మృతి

బండ్లగూడ, నవంబర్ 9 : ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం తెల్లవారుజామున ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొనడటంతో ఈప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్‌సాగర్ వద్ద ముందు వెళ్తున్న లారీని డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం నడుపుతున్న డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. డీసీఎం వాహనంలో ఇరుక్కున్న మృతదేహాన్ని పోలీసులు అతి కష్టం మీద బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

### బెల్టు దుకాణంపై దాడి.. కేసు

హయత్‌నగర్, నవంబర్ 9 :హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి పెద్దఅంబర్‌పేటలో కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 57 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. మద్యం బాటిళ్ల విలువ దాదాపు రూ.4వేలు ఉంటుందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. 500 లీటర్ల కల్లును పారబోసినట్లు వెల్లడించారు.

## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మల్కారంలో కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సతీశ్, తదితరులు

శంషాబాద్ రూరల్, నవంబర్ 9 : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మల్కారం పీఏసీఎస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్ తెలిపారు. గురువారం మండలంలోని మల్కారం సహకార సంఘం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. రైతులకు సాగునీరు అందించడంతో పాటు వరి ధాన్యం కొనుగోలు చేసి వారిని ఆదుకుంటున్నట్లు తెలిపారు. రైతులు తాళు తేమ లేకుండా 14వాతం కంటే తక్కువ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు గోనె సంచులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు శివాజీ, కృష్ణారెడ్డి, రెడ్యానాయక్, సీఈవో సురేందర్, విక్రం తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల రక్షణకు భరోసా

- ఆధునిక హంగులతో సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు

సైదాబాద్, నవంబర్ 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల రక్షణకు భరోసా కల్పిస్తున్నది. శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఆధిక టెక్నాలజీ నిఘా నీడల్లో ప్రజలకు మరింత కల్పిస్తుంది. ప్రజలకు ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలందించటమే లక్ష్యంగా పని చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ల ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నది. అందులో భాగంగా శిథిలావ్యస్థలో ఉన్న పురాతన సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌ను కూల్చివేసి అదే స్థానంలో సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌ను నాలుగు కోట్ల రూపాయలతో కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక వసతులతో, సువిశాలమైన ప్రదేశంలో నిర్మించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.




అత్యాధునిక హంగులతో నిర్మించిన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ భవనం

### మహిళలకు ఆత్మస్థైర్యం పెంచుతున్న భరోసా కేంద్రం...

సైదాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలోనే మహిళా కౌన్సింగ్ సెంటర్ (భరోసా కేంద్రం) కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాంతో మహిళల్లో ఆత్మస్థైర్యం పెంచి వారికి భరోసా కల్పించటానికి ఎంతో ఉపయోగపడుతున్నది. అదే విధంగా మహిళల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించుకోవటానికి ఎంతోగాను అనుకూలంగా ఉన్నది. భరోసా సెంటర్‌లో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలు వంటి పనులను పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారు. ఒకే దగ్గర పోలీస్ స్టేషన్, భరోసా కేంద్రం, ఏసీపీ ఆఫీసులను ఏర్పాటు చేయటంతో ప్రజలకు మెరుగైన సేవలను అందించటానికి ఎంతోగాను ఉపయోగకరంగా ఉన్నది.

### ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థతో మెరుగైన సేవలు...

అత్యాధునిక హంగులతో వసతులను కల్పించటంతో పాటు స్టేషన్‌కు వచ్చేవారితో స్నేహపూర్వకంగా వ్యవహరించే విధంగా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రజలనుంచి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల అదేశాలను పాటిస్తున్నారు. నేరాల అదుపునకు స్టేషన్ పరిధిలో వందలాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా శాంతి భద్రత చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ, నేరాలు జరుగకుండా గట్టి నిఘా పెట్టారు. నేరాలు జరిగిన వెంటనే పోలీసులు స్పందిస్తున్న తీరును, పని విధానాన్ని ప్రజలు మెచ్చుకుంటున్నారు..

## యాకుత్‌పురాలో 11మంది నామినేషన్ దాఖలు




యాకుత్‌పురా ఆర్వో వెంకటాచారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఎంబీటీ అభ్యర్థి అమ్జాదుల్లాఖాన్

సైదాబాద్, నవంబర్ 9 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం యాకుత్‌పురా నియోజకవర్గానికి 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చంపాపేటలోని సైదాబాద్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన యాకుత్‌పురా ఆర్వో కార్యాలయంలో తమ నామినేషన్లను సమర్పించారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున సామ సుందర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా ఎంబీటీ పార్టీ తరుపున అమ్జాదుల్లాఖాన్ తన నామినేషన్ వేశారు. అదేవిధంగా మరో తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్ వేసి వాటి పత్రాలను ఆర్వో వెంకటాచారికి అందజేశారు. అంతకుముందు అభ్యర్థులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్యకర్తలతో కలిసి భారీ ఊరేగింపు తరలివచ్చి నామినేషన్‌లు వేశారు.

## అహ్మద్ బలాల ప్రచారానికి స్పందన



ఎమ్మెల్యే అహ్మద్ బలాలను ఆశీర్వదిస్తున్న మహిళ

చాదర్‌ఘాట్, నవంబర్ 9:మలక్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. గురువారం ఆజంపురా డివిజన్‌లోని కాలాడేరా, పూల్‌బాగ్ పరిసర ప్రాంతాలు, సాయంత్రం చావనీ డివిజన్‌లోని చంచల్‌గూడ చౌరస్తా, సుల్తాన్ దయారా, మహ్మదన్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఇంటింటి పాదయాత్ర చేపట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలియజేశారు. మరోసారి గెలిపిస్తే సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ గుర్తు పతంగిపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఛావునీ డివిజన్ కార్పొరేటర్ ఎం.ఏ.సలాం షాహీద్, షేక్ మొహియుద్దీన్ అబ్రార్, అలీం తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో మజ్లిస్ జెండా ఎగురవేస్తాం : మెరాజ్



పాతబస్తీలో ప్రచారం చేస్తున్న ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి హుస్సేన్ మెరాజ్

మాదన్నపేట, నవంబర్ 9 : పాతబస్తీలో మజ్లిస్ పార్టీ జెండా ఎగరవేయటం ఖాయమని యాకుత్‌పురా నియోజకవర్గ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మెరాజ్ అన్నారు. గురువారం కుర్మగూడ, సంతోష్‌నగర్, రైయిన్ బజార్ డివిజన్ల పరిధిలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించటంలో ముందుంటే మజ్లిస్ పార్టీ ప్రజలంతా కొరుకుంటున్నారని అన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ ప్రజలకు అందుబాటు ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. పాతబస్తీలో మజ్లిస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయని అన్నారు. కార్యక్రమంలో యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి యాసిన్ ఆరాఫత్, కార్పొరేటర్లు సమీనా బేగం, ముజఫర్ హుస్సేన్, నాయకులు షాబాద్, షర్వాన్ తదితరులు పాల్గొన్నారు.